**జరిగిన కథ :** కాశీమజిలీల్లో ప్రస్తుతం సప్తమిత్ర చరిత్రలో ఉన్నాం. భోజుని కొలువు సంపాదించుకోవాలనే లక్ష్యంతో కాశీనుంచి బయల్దేరిన మిత్రుల్లో చివరివాడి కథ ఇది. నిజానికి అందరికంటే ముందు భోజరాజును కలిసింది ఇతనే! పేరు ఘోటకముఖుడు. భైరవుడనే తాంత్రికుడు ఎత్తుకుపోయిన భోజుని ఇల్లాలిని వెతికే పనిలో రాజుకు సాయం చేశాడు. ఆ తరువాత అందరికంటే ఆలస్యంగా ఇద్దరు యువతులను వెంటబెట్టుకుని, ధారానగరానికి వచ్చాడు.



కాశీ మజిలీ కథలు 124

అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ

# అవ్వ కుటీరం - వరాహపురం

ఘోటకముఖుడు తనకు అవ్వతో జరిగిన సంభాషణ చెబుతున్నాడు.

''సరేనవ్వా! నాకు నీ డబ్బుతో పనిలేదు. నా మిత్రులిద్దరు మహారాజులయ్యారు. వారి డబ్బును నేను కావాల్సినట్లుగా ఖర్చుపెట్టుకోవచ్చు. కానీ నీవల్ల నాకో సాయం కావాల్సి ఉంది. నీ అల్లుడు రాజు కదా! నన్నొక సారి వరాహద్వీపానికి తీసుకుపో. నిన్ను గుర్రంగా మార్చివేసిన తాంత్రికుడు నీలాగే అనేకమంది స్త్రీలను కూడా జంతువులుగా మార్చాడు. వాణ్ని సంహరించాలంటే.. మహారాజు సహాయం అవసరం'' అని కోరాను.

''సరే నాయనా! ఇప్పుడే వెళదాం'' అంటూ నన్ను బయల్దేరదీసింది.

ఇంతలో అనేక ఆవులు, ఎద్దులు ఆమె వద్దకు వచ్చాయి. ఆమెను నాకుతూ, ముట్టెలతో పొడుస్తూ వియోగబాధను తెలియచేశాయి. ఆమె కొన్నిటిని గంగడోలు దువ్వి ఓదార్చింది. మరికొన్నిటిని పేరుపెట్టి పిలిచి, చేరదీసింది. అది చూసిన నేను..

''అవ్వా! నువ్వు చెప్పింది నిజమే. పశుపత్ని సుతాలయాలు రుణానుబంధ రూపంగా ఏర్పడతాయి!'' అన్నాను.

''అవును నాయనా! నా పశువులను ఎవ్వరూ తీసుకుపోలేరు. ఒకవేళ బలవంతంగా తోలుకు పోయినా అవి ఎందులోనూ కలవవు. వెంటనే పారిపోయి వచ్చి మందలో కలిసిపోతాయి. సరే.. మనం వెళదాం పద!''.

.. అంటూ ఆమె మౌనంగా తన కుటీరంలో అంతకు ముందు తలుపులు మూసి ఉన్న గదికి సరిగ్గా వెనుక వైపు తీసుకువెళ్లింది. దానిలో చాలా నిగూఢంగా అమరి ఉన్న చిన్నతలుపు తీసింది. దానిలో ఒక నేలసొరంగం ఉంది. ఇద్దరం దానిలోకి దిగాం. లోపల మిక్కిలి విశాలంగా ఉంది. ఇంద్రభవనంలా ఉంది. వింతవింత వస్తువులున్నాయి.

''ఇందాక చెప్పాను కదా.. ఈ గది ఉన్న జాడ నా కూతురికి కూడా తెలియదు అని. ఒకప్పుడు నా అల్లుడికి చెప్పాను. తరువాత ప్రాణదాతవు కనుక, నీకు చెప్పాను. సరే.. నా కోరిక నెరవేరింది. ఇంక నువ్వు అడిగింది చేస్తాను. పద ప్రయాణం కడదాం'' అన్నది అవ్వ.

మంద దగ్గరికి పోయి రెండు దున్నపోతులను తీసుకొచ్చింది. వాటివీపుపై మెత్తని ఆకులు, చిగుళ్లు కలిపి జీనులాగా కట్టింది. ఒకదానిపై తానెక్కి, రెండోదానిపై నన్ను ఎక్కమంది.

నాకు నవ్వు వచ్చింది. కానీ వేరే ప్రయాణ సాధనం లేకపోవడం వల్ల, ఆమె చెప్పినట్లు చేయక తప్పలేదు. ఆ కొండలలో పాదచారిగా వెళ్లడం చాలా కష్టమట. యముడంతటి మహాత్ముడు సైతం దున్నపోతును సాధనంగా చేసుకున్నాడు. ఇక మన మాట లెక్కేమిటి? అని నేను దానిపై ఎక్కాను.

అవ్వ ముందు వెళుతుండగా.. నేను వెనుక పోతున్నాను. కొంచెమైనా కుదుపు లేదు. ఆ దున్నపోతులు చాలా వేగంగా నడుస్తున్నాయి. ఏమీ అదిలించాల్సిన అవసరం రాలేదు. మిట్టలు ఎక్కేటప్పుడు ముందు శరీరాన్ని వంచుతూ.. పల్లానికి దిగేటప్పుడు వెనుక శరీరాన్ని వంచుతూ మాకు ఆయాసం లేకుండా నడుస్తున్నాయి.

మూడురోజులపాటు అలా పయనించి.. సముద్రతీరంలో ఉన్న ఒక పల్లెను చేరుకున్నాం. అవ్వ ఒక ముసలివాని వద్దకు వెళ్లి.. వరాహపురానికి ఓడ కట్టమని నియోగించింది. వాడప్పుడే ఒక చిన్న ఓడ తెచ్చి మాకోసం అట్టేపెట్టాడు. మేము పెందలకడనే భోజనం చేసి ఓడ ఎక్కాం. పొద్దు గుంకడానికి ముందుగా ఆవలి ఒడ్డుకు చేరాం.

వెంటనే ఒక బండి ఎక్కి నగరాన్ని చేరుకున్నాం. ఆ నగరం మహోన్నతమైన సౌధాలచేత, సమస్త వస్తువులతో నిండిన వాణిజ్య మార్గాలతోనూ ప్రకాశిస్తున్నది. రాజమార్గాన కోటకు చేరుకున్నాం.

ఆ అవ్వను అందరూ ఎరిగినవారే కావడంతో ఎవ్వరూ అడ్డగించలేదు. ఆమె నన్ను తిన్నగా లోపలి భవనానికి తీసుకుపోయింది. తల్లి వస్తున్నదన్న వార్త తెలిసి ఆమె పుత్రికైన మిత్రవింద కొంతదూరం ఎదురు వచ్చింది. నన్ను చూసి పక్కకు తొలగబోయింది.

''వద్దు వద్దు. ఈయన మనకు ఆంతరంగిక బంధువు. అర్చనీయుడు. ఈయనకు పాద్యం తీసుకురా!'' అని అవ్వ చెప్పింది. ఆమె నాకు కాళ్లు కడుక్కునేందుకు నీళ్లిచ్చింది. సకలోపచారాలు చేసింది.

''నీ భర్త నగరంలోనే ఉన్నాడా ?'' అని అడిగింది అవ్వ.

''లేరు. వారి మిత్రుడైన విపులుడు వర్తమానం చేయగా మహాపురానికి వెళ్లారు. రేపటి మధ్యాహ్నానికి తిరిగి రాగలరు'' అని సమాధానం ఇచ్చింది మిత్రవింద.

ఆ రాత్రికి నాకు విందుభోజనం వడ్డించారు. హాయిగా నిద్రించాను. మరునాడు మంగళగీతాలతో